
# కథావేదిక

**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం**

## స్వాతంత్ర్యం

-డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం



బయట మోపెడ్ ఆగిన శబ్దం విని బయటకు వచ్చింది మంజీర. బండి పార్క్ చేసి తాళం వేస్తున్న ఊర్మిళ తలెత్తి చూసి నవ్వింది.

"నువ్వేనని అనుకున్నాలే. నీవు హారన్ కొట్టే స్టైలే వేరుకదా" స్నేహితురాలి చేయి పట్టుకుని లోపలకు తీసుకువెళుతూ ఆప్యాయంగా అంది మంజీర.

"రవి ఇంట్లో లేడా?" కూర్చుంటూ అడిగింది ఊర్మిళ.

"షామియానా, కుర్చీలు అవీ ఏర్పాటు చేయడానికి వెళ్లాడు, వచ్చేస్తాడులే. ఈ లోపుగా నీకు టీ పెట్టిస్తాను" లోపలకు వెళుతూ చెప్పింది మంజీర.

"ఏమిటీ... మీ వెడ్డింగ్ డే ఈసారి భారీ ఎత్తున జరుపుకోవాలనుకుంటున్నారా? ఎంతమందిని పిలుస్తున్నావేం?" రిమోట్ కంట్రోల్‌తో టీవీ ఆన్ చేస్తూ అంది ఊర్మిళ.

"సుమారు మూడువందలమందిదాకా రావచ్చు. అయినా వెడ్డింగ్ డే కాదు తల్లీ. మా మహిళా మండలి యాన్యువల్ డేకి" చెప్పింది మంజీర.

"ఎన్నిసార్లు చెప్పాను మా క్లబ్‌లో చేరమని? ఎప్పుడూ వంటిల్లే వైకుంఠం కడుపే కైలాసం అనుకుంటూ కూర్చుంటే బాగుపడవు ఊర్మిళా... రేపు ఫంక్షన్‌కు రా. ఎంతమంది ఎన్ని విషయాల గురించి మాట్లాడతారో విందువు. డెకరేషన్, సీటింగ్ అరేంజ్‌మెంట్ నామీద పడ్డాయి. ఇవాళ ఆఫీసు నుండి రాగానే పరుగెత్తాడు" మంజీర నవ్వుతూ వచ్చి ఊర్మిళ పక్కన కూర్చుంది.

"పోనిద్దూ... ఇవన్నీ ఉద్యోగం చేసే నీలాంటి వాళ్లకు. నాకెందుకు? నువ్వు టీ కలిపేంతలో నేను ముఖం కడుక్కుని వస్తాను. మధ్యాహ్నం మూడింటికి బయల్దేరాను." అంటూ చనువుగా డైనింగ్ రూములోకి వెళ్లింది ఊర్మిళ.

"మరి మూడింటికి బయల్దేరితే అయిదున్నరదాకా ఏం చేస్తున్నావేం?" వెనకాలే వెళ్లి టవలు అందించింది మంజీర.

కుళాయి తిప్పినా నీళ్లు రాకపోవడంతో ప్రశ్నార్థకంగా స్నేహితురాలివైపు చూసింది ఊర్మిళ.

"భయపడకు. టాంకులో నీళ్లున్నాయిలే. ట్యాప్ లీకవుతుంటే క్రింది నుండి నేనే మూసేసాము. క్రింద ఓపెన్ చేయి నీళ్లొస్తాయి" టవలు ఊర్మిళ భుజం మీద వేసి ఫ్రిజ్‌లోంచి పాలు తీసుకోవడానికి హాల్లోకి వెళ్లింది మంజీర.

"కటింగ్ ప్లేయర్, వాషర్ ఎక్కడున్నాయ్ చెప్పు నిముషంలో రిపేర్ చేసేయవచ్చు" ఊర్మిళ కుళాయి పరిశీలించి చూసి అడిగింది.

"ఏమో బాబూ... అవన్నీ ఆ స్టోర్ రూంలో ఎక్కడున్నాయో రవికే తెల్సు. ఆ రిపేర్ పన్లు అవీ నాకు రావు" వంటింట్లో నుండి అంది మంజీర.

స్టోర్ రూంలోకి వెళ్లి వెదికి కావాల్సినవి తెచ్చుకుని అయిదు నిముషాల్లో వాషర్ వేసి చేతులు కడుక్కుని వచ్చి కూర్చుంది ఊర్మిళ.

"ఎండలో తిరిగి వచ్చి నీకెందుకీ అవస్థ? రవి వచ్చాక చూసేవాడుగా" టీ కప్పు అందించి పక్కన కూర్చుంది మంజీర.

"సరేగానీ ఇంతసేపు ఏమేం పన్లు చక్కబెట్టుకొచ్చావో చెప్పనేలేదు"

"యూనివర్శిటీకి వెళ్లి చందూకు అప్లికేషన్ తీసుకున్నాను. గ్రైండర్ ట్రబుల్ ఇస్తుంటే బాగుచేయించుకుని వచ్చానంతే"

"ఊర్మీ! నాకు తెల్సు. మీ ఆయన ది గ్రేట్ రఘు తిలక్‌గారు ఇంట్లో పనులు చిటికెనవ్రేలు వేసి ముట్టుకోరు. ఇక ఈ బయటి పనులు కూడా నీమీదే వేసెయడం అన్యాయం. ఈసారి వచ్చినప్పుడు తిలక్‌తో గట్టిగా పోట్లాడతాను చూడు. అసలు తప్పు నీలాంటి ఆడవాళ్లది. గంగిరెద్దులా తలూపడం తప్ప నీ హక్కులకోసం, వ్యక్తిత్వంకోసం పోరాడకపోతే ఎలా?" మంజీర ఆవేశపడింది.

"నీకు మహిళామండలి భావాలేకాదు, భాష కూడా బాగానే పట్టుబడింది" అంటూ ఊర్మిళ నవ్వేసింది.

"అదిగో ఆ నవ్వే వద్దనేది. బానిసత్వంలోపడి మగ్గుతూ ఇదే స్వర్గం అని ఆడవాళ్లు అనుకోబట్టే మగవాళ్లు అధికారం చలాయిస్తున్నారు. అందుకే ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటే మనమూ వాళ్లతో సమానమని నిరూపించుకోవచ్చునే అని నీకు ఎన్నిసార్లు చెప్పినా తలకెక్కదు. వచ్చిన ఉద్యోగాన్ని కూడా పిల్లలు చిన్నవాళ్లు అంటూ వదులుకున్నావు" మంజీర ఆవేశం చల్లారలేదు.

"బాలుకు పరీక్షలు అయిపోయాయా? సెలవుల్లో ఇంటికొస్తున్నావా? లేక అమ్మావాళ్ల ఇంటికి పంపిస్తున్నావా?"

కొడుకు ప్రస్తావన రాగానే మంజీర శాంతించింది.

"ఎల్లుండికి పరీక్షలయిపోతాయి. ఇక్కడ నాలుగురోజులుండి అమ్మమ్మ దగ్గరకి వెళ్తానంటున్నాడు. వాడికి ఇక్కడ బోర్" అంది కాస్త దిగులుగా.

"అందుకే నీకు చిలక్కి చెప్పినట్లు చెప్పాను ఇంకో ఆడపిల్లని కనవే, వాడికి ఆడుకోవడానికీ, పోట్లాడుకోవడానికీ జత వుంటుంది అని. విన్నావా?" సరదాగా అంటూ మంజీర చెవి మెలివేసింది ఊర్మిళ.

"మరేం... అప్పుడు సంవత్సరానికి ఇంకో పన్నెండు వేలు హాస్టల్‌కు కట్టాల్సి వచ్చేది. ఇంత డబ్బు కట్టి అంత పేరున్న స్కూలో వేసినా బాలు చదువు అంతంత మాత్రంగానే ఉంది" మంజీర నిట్టూర్చింది.


"సరేగానీ నువ్వెప్పుడు వస్తున్నావు మా ఇంటికి? నువ్వొచ్చి పిలవందే నీ వెడ్డింగ్ డేకి రాను సుమా" సరదాగా అంది ఊర్మిళ.

"ఆ... వెడ్డింగ్ డేకి ఏం కొనుక్కుందాం?" ఉత్సాహంగా అడిగింది మంజీర. తమాషాగా స్నేహితురాళ్లిద్దరి పెళ్లి నాలుగురోజుల తేడాలో జరిగింది. అందుకే మంజీర ఆ ఊరికి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చిన ఈ అయిదేళ్ల నుండీ ఆ రెండు కుటుంబాలు వాళ్ల పెళ్లిరోజులు చాలా సరదాగా జరుపుకుం



## పోటీలేదు

తెలుగులో తన ప్రాధాన్యం తగ్గిపోయిందంటూ వస్తున్న వార్తలను త్రిష ఖండిస్తోంది. రోజురోజుకీ కొత్త తారలు ఎంతమంది వచ్చినా అటు టాలీవుడ్ ఇటు కాలీవుడ్ రంగంలో తన ఇమేజ్‌కు ఎలాంటి ఢోకా లేదని ఆమె ధీమా వ్యక్తం చేస్తోంది. తెలుగులో ఇంచుమించు అగ్ర హీరోలందరితోనూ నటించిన త్రిష రెమ్యునరేషన్ విషయంలో ఎలాంటి పట్టువిడుపులకు తావులేదంటోంది. గ్లామర్ పెంచుకోవడానికి తానెంతో ప్రాధాన్యత ఇస్తానని త్రిష చెబుతోంది.



టున్నారు. "నువ్వు చెప్పు ఏదైతే బావుంటుందో" ఊర్మిళ ఆలోచిస్తూ అంది.

"మొన్న సాయంత్రం బజారుకు వెళ్లినప్పుడు ఒక నెక్లెస్ చూసాను. ఎంత బాగుందనుకున్నావు. చూస్తే వదిలిపెట్టవు. ఒకే మోడల్‌వి రెండున్నాయి. మనిద్దరం కొనుక్కుందాం సరేనా" ఉత్సాహంగా అంది మంజీర.

"నీకిప్పటికే మూడో నాలుగో నెక్లెసులున్నాయి. వాటిని ఎన్నిసార్లు వాడుతున్నావు? ఎప్పుడూ బ్యాంకు లాకర్‌లోనే ఉంటాయి" మళ్లీ ఇంకోటి అవసరమా అన్న టోన్‌తో అంది ఊర్మిళ.

"అవును సుమీ. ఐమీన్ ఆ కొత్త నెక్లెస్ డిజైన్ నాకున్న వాటి పోలికలు లేనిదైతేనే కొంటాను. అయితే రవి రాగానే చెప్తాను రేపు బ్యాంకు నుండి నా నెక్లెస్‌లు పట్టుకురమ్మని. ఈలోగా నువ్వు తిలక్‌గారి అనుజ్ఞ తీసుకో" ఆ వాక్యం కాస్త నొక్కి మరీ అంది మంజీర.

"నీ లాకరులో నగలు నువ్వు తెచ్చుకోక రవిని తెమ్మని అడగడం దేనికి?"

"అబ్బా... ఆ బ్యాంకుకు వెళ్లడం, ఆ ఫార్మాలిటీస్ అన్నీ నాకు బోర్‌లే" విసుగ్గా అంది మంజీర.

"సరే... నువ్వెప్పుడు వస్తున్నావు మరి" రెట్టించింది ఊర్మిళ.

"నాకు రేపు సాయంత్రం మహిళా మండలి మీటింగ్. రవికి ఎల్లుండి వీలు పడదు. గురువారం వస్తాము. నేనొక్కత్తినే వస్తే మీ ఇల్లు కనుక్కోవడానికి నానా అవస్థలు పడాలి. రవితో వస్తే ప్రాబ్లమ్ ఉండదు" మంజీర నవ్వుతూ అంది.

"చిత్రంగా మాట్లాడతావు మంజూ. ఈ అయిదేళ్లల్లో కనీసం ఇరవైసార్లు మా ఇంటికి వచ్చావు. ఒక్కత్తివీ రాలేననడానికి సిగ్గుపడాలి" అంది ఊర్మిళ.

"తల్లీ! నీలాగ మోపెడ్ ఉంటే ఎలాగో అటూ ఇటూ వెదికి వచ్చేదాన్ని. అయితే బండి నడపడం ఎందుకు నేర్చుకోలేదు అని ప్రైవేటు చెప్పకు. హాయిగా వెనకాల కూర్చుని రాక ఆ టెన్షన్ అంతా ఎవరు పడతారు చెప్పు? సరేగానీ గురువారం సాయంత్రం రెడీగా ఉండు. తిలక్‌ని కూడా రెడీగా ఉండమను. అందరం బజారుకెళ్లి నెక్లెస్ చూద్దాం."

ఊర్మిళ నవ్వింది. "మనం నెక్లెస్ కొనుక్కోవాలంటే వాళ్లకెందుకీ పనిష్మెంట్? సరే ఈలోగా నేను ఆలోచిస్తాను" అంటూ వెళ్లడానికి లేచింది.

★★★

"రవి! ఈసారి వెడ్డింగ్‌డేకి నెక్లెస్ కొనుక్కోవాలనుకుంటున్నాను. ఎల్లుండి బజారుకు వెళదామని చెప్పాను ఊర్మిళకు" రెండురోజుల తరువాత భర్తతో అంది మంజీర.

"వ్వాట్? నెక్లెసా? ఇది టాక్స్ కట్టే నెల మేడమ్? కొంచెం దిగిరండి" సరదాగానే గుర్తు చేసాడు రవి.

"ఇన్‌కంటాక్స్‌కు వెడ్డింగ్‌డేకి ఏమిటి ముడి? అవన్నీ నాకు తెలీదు. నాకు ఎనిమిదివేలు డ్రా చేసి తీసుకురా. నా జీతమంతా తెచ్చి చేతికిస్తున్నాను. నాకోసమంటూ చిన్న సరదాలకు కూడా నువ్వు లెక్కలు చూడడం బాలేదు రవి" కోపంగా అంది మంజీర. రవి జవాబు చెప్పలేదు. నిట్టూర్చి ఊరుకున్నాడు.

★★★

"ఈసారి వెడ్డింగ్ డేకి మనమేం కొనుక్కుందాం తిలక్" ఆఫీస్‌కు బయల్దేరబోతున్న భర్తతో అంది ఊర్మిళ.

"అది డిసైడ్ చేయాల్సింది నువ్వు" నవ్వాడు తిలక్.

"అయితే వాషింగ్ మెషిన్ కొందాం" కొంటెగా అంది.

"ఆ వాషింగ్ మెషినా? అంత బడ్జెట్ ఉందా ఫైనాన్స్ మినిస్టర్‌గారూ?"

"బడ్జెట్ గురించి దిగులు పడకండి మహాశయా! ఐడియా ఎలా ఉంది? పనిమనిషి సరిగ్గా బట్టలు ఉతకదు. మాటిమాటికి మానేస్తుంది అందుకుని" ఊర్మిళ అంది.

"బ్రహ్మాండమైన ఆలోచనేగానీ... అయినా కొనిపించేదిది భార్యగారట. కొనునది వాషింగ్ మెషినట. కొనుటకు నే దిగులు పడగనేల?" రాగయుక్తంగా అన్నాడు రఘు తిలక్.

★★★

ఊర్మిళ నవ్వింది. "నాకు తెలుసే తల్లీ. నువ్వు నెక్లెస్ కొనవని ఆ రోజే అనుకున్నా. వాషింగ్ మెషిన్ నీ ఇష్ట ప్రకారమే కొన్నామని ఎన్ని కబుర్లు చెప్పినా నేను నమ్మను" మంజీర కోపంగా అంది. ఊర్మిళకు మంజీర అమాయకత్వానికి నవ్వొచ్చింది. ఇక వాదించి ప్రయోజనం లేదని ఊరుకుంది.

★★★

పెళ్లిరోజు హడావుడి ముగిసి నెలరోజులు గడిచాయి. ఒకరోజు మంజీరకు ఫోన్ చేసింది ఊర్మిళ.

"మంజూ! నేను, చందనా వైజాగ్ వెళ్తున్నాం. చందు అడ్మిషన్ కోసం. తిలక్‌కి సెలవు దొరకదు అందుకని."

"కొత్త ఊరు... మీరిద్దరూ వెళ్లి ఎక్కడ దిగుతారు?" మంజీర అడిగింది.

## స్త్రీ పౌరోహిత్యం

దేశంలో ఇప్పుడు కూడా చాలామంది స్త్రీలకు తమ వివాహ విషయంలో స్వతంత్రం లేదు. అలాంటిది ఒక పెళ్లికి ఒక స్త్రీ పౌరోహిత్యం వహించడం అంటే మాటలా? గుజరాత్‌లో శారదాబేన్ వేదమంత్రాలు చదువుతూ ఒక పెళ్లి జరిపించి ఇటీవల ఒక కొత్త వరవడిని నెలకొల్పింది. స్వచ్ఛమైన ఉచ్చారణతో మంత్రాలు చదువుతూ వాటికి అర్థాలు చెబుతూ ఆమె పెళ్లి జరిపిస్తుంటే ఆహుతులు ఆశ్చర్యపోయారు. వధువు కేపా వరమానందపడింది. పెళ్లికొడుకు తండ్రి కూడా ఈ తంతుకి ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు సరికదా ఇలాంటి పెళ్లిళ్లు మరెన్నో జరగాలని ఆశిస్తున్నానన్నాడు.

## టీచర్లకి సెక్సప్పీల్ కావాలట!

ఇటీవల హాంకాంగ్‌లో ఇంగ్లీషు క్లాసులకి వచ్చే చైనీస్ టీచర్లు ముందుగా తమ అందచందాల్ని ఒలకబోస్తూ తమ ముఖాల్ని, డ్రెస్సుని, చెప్పుల్ని, నిలబడే విధానాన్ని ఏ విధంగా తీర్చిదిద్దుకోవాలో ఫ్యాషన్ స్పెషలిస్టుల దగ్గర తర్ఫీదు పొందుతున్నారట. కాలేజీలకు వెళ్లాలంటే విద్యార్థులు పోటీపడి చదవాలని, వాళ్లని ఆకట్టుకోవాలంటే టీచర్లు సెక్సప్పీల్‌తో ఆకర్షించాలని అలా తయారవుతున్నారట. అలాంటి అందమైన టీచర్ల కోసం స్కూళ్ల మేనేజ్‌మెంట్లు కూడా టీవీల్లో, పత్రికల్లో ప్రకటనలు ఇస్తున్నాయిట.

-విమలారామం



"మాకు తెలిసినవాళ్లున్నారులే. అడ్రస్ ఉంది. ఇల్లు వెదుక్కుని వెడతాం. ఒకవేళ వాళ్లు ఊళ్లో లేరంటే హోటలే గతి" తేలిగ్గా అంది ఊర్మిళ.

"ఎల్లుండి కదా బయల్దేరేది. నేను రవి వస్తాం సెండాఫ్ ఇవ్వడానికి" అని ఫోన్ పెట్టేసింది మంజీర.

★★★

ఆ రోజు ఆఫీసు నుండి రాగానే తనకు రవికి జరిగిన వాగ్వివాదం గుర్తుకొచ్చింది మంజీరకు. ఆఫీసుకు సంబంధించిన పనిమీద మంజీర రెండురోజులు చెన్నై వెళ్లాల్సి ఉంది. అందుకని ఆ రోజు రవి రాగానే అంది.

"రవి! నువ్వు రెండురోజులు సెలవు పెట్టాలి. నాకు మద్రాస్ వెళ్లే పని వుంది" అని.మామూలుగా అయితే రవి మృదువుగా చెప్పేవాడే. కానీ ఆరోజు అతను చాలా అలసిపోయి ఉన్నాడు. నాలుగు రోజుల్లో జరగనున్న ఇన్‌స్పెక్షన్ గురించి చాలా పని చేయాల్సి రావడంతో ఓపిక లేకపోయింది అతనికి.

"ఉద్యోగం చేస్తున్నది నువ్వు. నీ పనులు నీ డ్యూటీ నువ్వు చూసుకోవాలి. నా ఉద్యోగం, బాధ్యతలు నాకుంటాయని మర్చిపోకు" అన్నాడు తీవ్రంగా.

"అయితే ఏమంటావ్? భార్యాభర్తలన్న తరువాత పరస్పరం సహాయం చేసుకోవడం అవసరం లేదా" కొంచెం సీరియస్‌గా అంది.

"చూడు మంజూ! నువ్వు కావాలంటే ఉద్యోగం మానేయ్. కానీ ప్రతిదానికీ నన్ను ఇరికించకు" అనేసాడు కోపంగా.

★★★

ఊర్మిళ నుంచి ఫోన్ వచ్చాక మంజీరకు జరిగిన సంఘటనలో తన తప్పు ఎక్కడో ఉందని తోచింది. ఊర్మిళ ఉద్యోగం చేయడంలేదని, ఆమెకు ఆర్థిక స్వాతంత్ర్యం లేదని పదే పదే అంటున్నది తను. ఉద్యోగం చేస్తున్న తను అన్ని విధాలా స్వతంత్రంగా బ్రతుకుతోందా? అన్న ప్రశ్న మొదటిసారిగా మంజీర మనసులో తలెత్తింది.

"రవి! నేను ఊర్మిళ ఇంటికి వెళ్తున్నా. చందన అడ్మిషన్ కోసం వాళ్లిద్దరూ వైజాగ్ వెళ్తున్నారు" మర్నాడు ప్రొద్దున్న రవితో అంది మంజీర.

"ఐ విల్ డ్రాప్ యు దేర్" అన్నాడు రవి.

"అక్కర్లేదు నేను వెళ్తాలే" చాలా మామూలుగా అంది మంజీర.

"అరె... నేను కూడా వాళ్లకు సెండాఫ్ ఇస్తానోయ్"

★★★

ఊర్మిళ, చందనా బయల్దేరే హడావుడిలో ఉండడంతో వాళ్లకు సాయం చేస్తూ రవిని పట్టించుకోలేదు మంజీర. రవి, రఘుతిలక్ దగ్గరకు వెళ్లాడు.

"రఘూ! సమయానికి డబ్బు సర్దావు. చాలా థాంక్స్" అంటూ ఎనిమిది వేలు తీసి రఘుకు అందించాడు.

"మంజీర ఒక్కోసారి చిన్నపిల్లలా మొండిపట్టు పడుతుంది. పరిస్థితులు అర్థం చేసుకోదు. తనను నొప్పించలేక, చేతిలో సమయానికి డబ్బు లేక తనకు తెలియకుండా మిమ్మల్ని అడగాల్సి వచ్చింది" మళ్లీ తనే అన్నాడు రవి.

"దాని గురించి అంత ఆలోచన దేనికి రవీ? ఊర్మిళ ముందు జాగ్రత్తతో చందు చదువుకోసం కూడబెడుతూ వచ్చిన డబ్బు రెడీగా ఉండబట్టి ఇవ్వగలిగాను. ఇప్పుడు తిరిగి ఇవ్వడం మీకేం ఇబ్బంది కాదుకదా" స్నేహంగా అన్నాడు రఘు తిలక్. ఒంటరిగా వదిలేసానని రవి ఏమనుకుంటాడో అని అతనికోసం వచ్చిన మంజీర వీళ్లిద్దరి సంభాషణ విన్నది. ఏమీ తెలియనట్టే అక్కడి నుండి వెళ్లిపోయింది.

★★★

"ఊర్మిళా! నువ్వు పక్కనే ఉంటావు కనుక చందన ఏ సబ్జెక్ట్ తీసుకోవాలో వాళ్లిచ్చిన ఛాయిస్‌లో జాగ్రత్తగా ఆలోచించి మరీ చేర్పించు" రైలు కదులుతుండగా ఊర్మిళకు చెప్పింది మంజీర.

"నేను చందుతో యూనివర్శిటీకి వెళ్లడంలేదు ఊర్మిళా. చదవబోయేది తను, ఉద్యోగం చేయాల్సింది తను. చందూ నిర్ణయించుకోవాలి ఏ సబ్జెక్ట్ అనేది. దాన్ని యూనివర్శిటీ బస్ ఎక్కించి నేను సింహాచలం వెళ్తాను. చాలా రోజులుగా అనుకుంటున్నా చూడాలని. రఘు చూసేసాడు. నాకు ఈ అవకాశం వచ్చింది కదా చూసి వస్తాను" మంజీర అంది.

"అన్నట్లు నేను ఎల్లుండి చెన్నై వెళ్తున్నా. రవికి ఇన్‌స్పెక్షన్ ఉందిలే. రాడు. నేను రాగానే నీకు ఫోన్ చేస్తాను" ఆత్మవిశ్వాసంతో అంది మంజీర.

ఊర్మిళ ఆశ్చర్యంగా చూసిందిగానీ ఏమీ అనలేదు. రైలు కదిలింది.

"నువ్వు చాలా కొత్తగా కనిపిస్తున్నావు" అన్నాడు రవి ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు.

"ఎస్! ఐ వాంట్ టు ఛేంజ్" నవ్వి అంది మంజీర.

★

## సృష్టి చిత్రం

ఈ సృష్టిలో శాకాహారం తినే ఏనుగులు, జిరాఫీలు భారీ ఆకారంలో ఉండగా, మాంసాహారాన్ని తినే సింహాలు, పులులు లాంటివి వాటికన్నా చిన్నవిగా ఉండడానికి కారణమేమిటని ఇటీవల శాస్త్రజ్ఞులు పరిశోధించారు. తమ శరీరాలు తేలికయినప్పుడే మాంసాహార జంతువులు తక్కిన జంతువుల్ని వేటాడి పరుగెత్తి పట్టుకుని చంపగలుగుతాయని వాళ్లు భావిస్తున్నారు. అంతేకాక, అవి వేటాడడానికి ఎక్కువ శక్తిని ఖర్చు పెట్టాలి కనుక తాము వేటాడిన జంతువుల మాంసాన్ని ఒకేసారి సుష్టుగా తిని శక్తిని సమకూర్చుకోవడానికి ఎక్కువసేపు విశ్రాంతి తీసుకుంటాయని, 20 కిలోల లోపు ఉండే జంతువులు ఎలుకలు, పురుగుల్లాంటి చిన్నవాటిని తరచుగా చంపి తింటూ తిరుగుతుంటాయని అంటున్నారు.

## స్త్రీల పని పెరిగింది

బ్రిటన్‌లో ఆఫీసుల్లో స్త్రీల పనివేళ పెరిగిపోతుండగా పురుషుల పనివేళ తరిగిపోతోందిట. 1992లో వారానికి 45 గంటలు పని చేసే స్త్రీల శాతం 7.8 ఉంటే, పురుషులకది 33.4 ఉండేదిట. 2006లో స్త్రీల శాతం 9.1కి పెరగ్గా, పురుషులది 27.5కి తరిగిపోయింది. స్త్రీలు ఎక్కువ సంపాదిస్తుండగా ఇంట్లో పిల్లల్ని చూసుకునే భర్తలు రెండులక్షలమందిదాకా ఉన్నారుట. ఇళ్ల ధరలు, అద్దెలు దారుణంగా పెరిగిపోవడమే దీనికి కారణమని ఆ సర్వేలో తేలింది.

-విమలారామం

